# రాతిబొమ్మకు చక్కలిగింతలు

సుబ్బరాయుడు అయ్యవారుగా పనిచేస్తున్నాడు. బుద్ధిజీవి.

బుద్ధిజీవి కనుక ఆలోచలు దండిగా ఉన్నై. ఆలోచనలున్నాయి కనుక దురాలోచనలూ, దూరాలోచనలు కూడా బుర్రని తొలిచేస్తూ వుంటాయతనికి.

అమావాస్యకీ, పౌర్ణమికీ ఉచ్ఛనీచాల్ని అనుభవించే మానసిక రోగంలా అతని ఆలోచనల్లోనూ, ఉచ్ఛనీచాల స్థాయీ భేదం, అస్తవ్యస్తతా తరచూ గోచరిస్తూ ఉంటాయి.

ఈ "బ్యాక్‌గ్రౌండ్" చాలు - సుబ్బరాయుడు ఆలోచనలతో సాన్నిహిత్యాన్ని పెంపొందించుకోవడానికి.

ఇవ్వాళ అతను పల్లెకి పోయి వచ్చాడు. పల్లెకి పోయి వచ్చినప్పుడల్లా అతనికి కడుపు రగిలిపోతూ ఉంటుంది. కసిత్వం పెల్లుబికిపోతూ ఉంటుంది.

పల్లెలో అతనికి అన్ని వికారాలో, ప్రకృతీ వికృతులూ కనిపించినై.

పెద్దిరెడ్డి ఎలపుటెద్దుని కసాయి వాండ్లకు అమ్ముకుంటున్నాడు.

ఎత్తునబడ్డ పుల్లావుని చూసుకుంటూ కన్నీరు కారుస్తున్నాడు, ధర్మయ్య.

చేతి గీరలు కనబడే ప్రొద్దున లేచి ఇసుర్రాయి గాలికి పోయినట్టు ఏ పడమటి దిక్కుకో పారిపోయినాడు, బాల్యమిత్రుడు పుల్లారెడ్డి.

ఎక్కిరించినట్టన్నా వస్తావుండే చెర్లోనీళ్ళు సమ్మెచేశాయి. చెరువున్న చోట చెలమన్నా లేదు, పత్తికాయ పగుళ్లలా.

గూడెంలో ఏమనిషికీ - కాకి పీకను కూడా కండలేదు.

రైతును కదిలిస్తే... పడవనేరిస్తే సరి వ్యవసాయం సెయ్యంటున్నాడు.

ఉద్యోగిని పలకరిస్తే "గోలుకొండ ఉద్యోగమూ గొర్రెతోకా ఒకటి"

అంటున్నాడు!

సన్నకారు జీవుల సంగతి సరేసరి. ఎవరెన్ని కబుర్లాడినా "ఒట్టి మాటలేగాని రొట్టిమీదికి తేమ లేదు" అంటున్నారు!

ఇవన్నీ ఒకెత్తు. తాగేదానికి చుక్కనీరు లేదు. బీదా బిక్కీ... గొడ్డూ గోదం... నడుస్తున్న శవాల్లా ఉన్నారు.

సుబ్బరాయుడి గుండె బేజారయి పోయింది.!

సుబ్బరాయుడికి ఎంచబోతే ప్రపంచమంతా కంతల్లా కనిపించింది. రకీమని నాలుగు మినీ కవితలూ.... పది పద్యాలూ రాసి పారేసేడు.

మణీ హోటల్లో కాఫీ తాగి మా ఇంటికొచ్చాడు. కాస్సేపు కవిత్వం వెళ్లబోసుకున్నాడు. ఆ తరువాత కసిత్వం మొదలైంది.

మింగ మెతుకు లేదు, మీసాలకు సంపెంగనూనె అని.... మనకీ సభలూ సన్నాహాలూ ఎందుకంట అసలు. ఆ డబ్బంతా గోడకు కొట్టిన సున్నమే కదా. దాన్నంతా వెచ్చిస్తే ఓ వంద గ్రామాలకి బోరింగులొచ్చేవి కావంటావా? అనే ప్రశ్నతో మొదలెట్టి సభలకు పోయి ఏడ్చినవాళ్లనీ, పోలేక ఏడ్చిన వాళ్లనీ; పోయిన వాళ్లనినీ చూసి ఏడ్చినవాళ్లనీ, పోయొచ్చిన వాళ్ల సన్మానాలు చూసి ఏడ్చినవాళ్లనీ.... అందరి ఏడుపుల్నీ - అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మనల ఏడ్పులతో కలగలిపి రస ప్రవాహకంగా ఏకరువుపెట్టాడు. ఆ తర్వాత సుబ్బరాయుడు కళ్లల్లో రక్తం దిగింది.

"నన్నడిగితే ఈ దేశంలో అత్యధికమయిన నెలసరి జీతం డ్రైవరుకివ్వాల" అంటూ ఊగిపోయాడు. శ్రీశైలంలో బస్సుప్రమాదం గురించి వివరించాడు. "డెబ్బై ఎనబై మంది ప్రాణాల్ని సేతుల్లో బెట్టుక నడుపుతావుంటాడు" అని, డ్రైవర్ల కష్ట నష్టాల్లో పడ్డాడు.

మాయావిడ నిమ్మరసం తెచ్చింది. సుబ్బరాయుడు వాక్ప్రవాహానికి అడ్డుకట్టబడింది. ఆవేశం ఒకింత చల్లబడింది. అప్పటిదాకా ఉచ్చరిస్తున్న "లం...లు" వగైరా సంస్కృత ముక్కల ధాటి తగ్గింది. నిమ్మరసం సేవించాడు.

ఆ తర్వాత... పెరిగిన పాల ధరమీదికి మళ్లింది... సంభాషణ. "ధర పెంచితే పెంచారయ్యా... సీసాలెందుకు పోయినట్టు. పోనీ, కవర్లా కరువైపోయాయా? ఏం దేశమయ్యా ఇది? ఈ దేశానికి మోక్షం లేదుగాక లేదుగాక, లేనేలేదు." అని వాగేసి... మాయల ఫకీరు చూపు విసిరేడు. "తెల్లవారు ఝామునే పోయి క్యూలో నిలబడతానా? నావెనుక ఒక్క వెధవా క్యూ 'మెయింటెయిన్' చెయ్యడు. అంతా 'అన్‌రూలీ' ఫెలోస్! ఈ జనానికి 'సివిక్‌సెన్స్' లేనేలేదు; రాదుగాక రాదు. అందుకనే.... నాలాంటి వాడికి ఒక 'చెర్నాకోల' ఇచ్చి; 'ఈ దేశాన్ని బాగు చేసే బాధ్యత నీది, నువ్వేంచేసినా సరే' అని ఫుల్ పవర్స్ ఇవ్వాల. నాలుగు రోజులు... జస్ట్ నాలుగురోజుల్లో 'షేపులు' మార్చి పారేసి; దడదడలాడించేయనూ!!"

సుబ్బరాయుడి ఛాతి నాలుగంగుళాలు ఉప్పొంగిపోయింది. కళ్లల్లో ఎంత తేజస్సు!

"ఇంతకీ నే చెప్పేది విన్నావా?" పాలని కేన్‌లలో పంపుతున్నారు. ఇక్కడ కొలతల్లో లొసుగు సంగతి ఏం చెప్పను? పెద్ద ట్రాజడీ అది. నాలాంటోడు సీసా పట్టుకెళ్లి గట్టిగా అడిగేడో అంతే సరి. మర్నాటినుంచి మాయావిడ నన్ను గేట్లోకి తోలేస్తుంది. కారణం మరేంలేదు. మర్నాటినుంచి మాకు పాలకు పుట్టగతి ఉండదు. ఇంతే సంగతులు... చిత్తగించవలెను. అయిపోతుంది".

సుబ్బరాయుడు కుర్చీలో అస్థిమితంగా కదిలేడు. ఆ తరువాత కొద్దిసేపు పెరిగిన బస్ ఛార్జీల గురించి తన అభిప్రాయాలు చెప్పేడు.

క్షణాల తరువాత....

'టాపిక్' ని పంచాయితీ ఎన్నికల వైపు మళ్ళించాడు. అట్నుంచీ ఐరిష్ గెరిల్లాలమీదికి దూకేడు; అక్కడ్నుంచి మిట్టరాండ్ పడబోయే అవస్థలకి జాలిపడ్డాడు; ఆపైన చైనా వాళ్లనుంచి మనకు ఇప్పట్లో యుద్ధ ప్రమాదం లేదని ఊపిరి పీల్చాడు; శ్రీహరికోటలో రాకెట్ లాంచింగ్ ఎలా జరుగుతుందో... దాని మార్గం వివరాలు వర్ణించాడు.

ఉన్నట్టుండి అతని వాయిస్ ఫెయిల్ అయ్యింది. నాకేసి చాలా తీక్షణంగా చూస్తూ ఉండిపోయాడు. "ఏమిటి సంగతి?" అని ప్రశ్నించాను... ఆతృతగా... ఏమన్నా అయ్యిందో ఏమో అనే భయంతో. ఈమధ్యనే ఒక హార్ట్ ఎటాక్ కేసును ప్రత్యక్షంగా చూశాను లేండి. గొంతుసరిచేసుకొని అడిగేడు, " ఇప్పుడు జరుగుతున్న సాహిత్య హింసాకాండ గురించి నీ ఉద్దేశ్యం ఏమిటి?" అని.

నేను చాలా దీర్ఘంగా ఆపులించాను, "రేపు మాట్లాడుకుందాంలే" అంటూ లేచాను. అతనూ కదిలేడు. "గొంగట్లో భోజనం చేస్తూ వెంట్రుకలు ఏరుకుంటున్నాం మనం." అన్న నా మాటలకి రియాక్షన్ లేకుండా, ముందుకు నడిచాడు - సుబ్బరాయుడు.

ధన్యోస్మి!!!

(మాసీమ 20 మే 1981.)

